క్లుప్తంగా

దత్తాత్రేయ స్వామి వారికి విశేష పూజలు

శ్రీశైలం టెంపుల్: లోకకల్యాణం కోసం దేవస్థానం గురువారం ఆలయప్రాంగణంలోని త్రిఫలవక్షం క్రింద నెలకొని ఉన్న దత్తాత్రేయ స్వామివారికి విశేషపూజలను నిర్వహించింది. ప్రతి గురువారం దేవస్థానసేవగా (సర్కారీ సేవగా) ఈ కైంకర్యం జరిపించబడుతోంది. పూజాకార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజను జరిపించారు. తరువాత దత్తాత్రేయస్వామివారికి పంచామృతాభిషేకం, విశేషపూజలు నిర్వహించారు.

చిన్న తరహా నీటి వనరుల గణనపై శిక్షణ

నందికొట్కూరు: చిన్న తరహా నీటి వనరుల గణనపై గురువారం రెవెన్యూ కార్యాలయంలో సూపర్‌వైజర్లకు, ఎన్యూమరేటర్లకు మాస్టర్ ట్రైనర్ ఉప-గణాంకాధికారి రామాంజనేయులు శిక్షణ ఇచ్చారు. బోర్లు, బావులు, చెరువులు, కుంటలు ఫారంపాండ్స్, లిఫ్ట్ ఇరిగేషన్‌ల వివరాలు ఎలా సేకరించాలో వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, మైనర్ ఇరిగేషన్ ఏఈ గౌతం, డీటీ సోమేశ్వరిదేవి, ఏఎస్‌ఓ హనుమంతు, వీఆర్వోలు పాల్గొన్నారు.

- **జూపాడుబంగ్లా:** తహసీల్దార్ కార్యాలయంలో మండల ఏఎస్‌ఓ, వివిధ గ్రామాల వీఆర్వోలు, సర్వేయర్లు, తహసీల్దార్ సిబ్బందికి చిన్ననీటి వనరులు, జలాశయాల గణనపై డిస్ట్రిక్ మాస్టర్ ట్రైనర్ రామాంజనేయులు గురువారం శిక్షణ ఇచ్చారు. గణన పూర్తికాగానే నివేదికను అధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సత్యదీప్, ఏఎస్‌ఓ హనుమంతు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అవగాహన అవసరం

శ్రీశైలం టెంపుల్: ఆన్‌లైన్ మోసాలపై మహిళలు తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని శ్రీశైలం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాదరావు సూచించారు. గురువారం శ్రీశైలంలోని మల్లికార్జున కల్యాణ మండపంలో పొదుపు సంఘాల మహిళలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, వాటి అనర్థాలపై వివరించారు. వేసవి సెలవుల్లో చిన్నారుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

ప్రవేశ పరీక్ష వాయిదా

వెలుగోడు: ఏపీ మోడల్ స్కూల్ ఆరో తరగతి ప్రవేశ పరీక్ష ఈనెల 21వ తేదీకి వాయిదా వేసినట్లు ప్రిన్సిపాల్ నళిని తెలిపారు. విద్యార్థులు గమనించాలన్నారు.

పొగాకు షెడ్డు దగ్ధం

బండిఆత్మకూరు: మండల పరిధిలోని యర్రగుంట్ల గ్రామంలో పొగాకు షెడ్డు దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు బొబ్బల పరమేశ్వర రెడ్డి తన ఎకరా పొలంలో పొగాకు సాగు చేశాడు. దిగుబడులను క్యూరింగ్ కోసమని షెడ్డు ఏర్పాటు చేసుకున్నాడు. షెడ్డులో నుంచి బుధవారం రాత్రి మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. దాదాపుగా రూ.3 లక్షల నష్టం వాటిల్లినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును రద్దు చేయాలి

నందికొట్కూరు: కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డ్ సవరణ బిల్లును రద్దు చేయాలని సీపీఐ జిల్లా నాయకులు రఘురామమూర్తి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని జై కిసాన్ పార్కు నుంచి పటేల్ సెంటర్ వరకు ముస్లింలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అక్కడ కర్నూలు-గుంటూరు ప్రధాన రహదారిపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ మతసామరస్యానికి వక్ఫ్ సవరణ బిల్లు విఘాతం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మజీద్ మియ్యా రహిమాన్, మహ్మదియా, రఫి, రజిత, రూప, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు

పగిడ్యాల: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ చట్టాన్ని అతిక్రమిస్తే క్రిమినల్ చర్యలు తప్పవని నందికొట్కూరు రూరల్ సీఐ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. గురువారం సాయంత్రం లక్ష్మాపురం గ్రామంలో స్పెషల్ పార్టీ బలగాలతో కవాతు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి నడుచుకోవాలని సీఐ సూచించారు.

కూలీల కడుపుకొడుతున్న ప్రభుత్వాలు



వేతనాలు చెల్లించాలని చేతులు జోడించి ప్రాధేయపడుతున్న ఉపాధి కూలీలు, నాయకులు

పగిడ్యాల: కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఉపాధి కూలీల కడుపుకొడుతున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పక్కీర్‌సాహెబ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలక్రిష్ణ విమర్శించారు. గురువారం పగిడ్యాల, ముచ్చుమర్రి సమీపంలో జరిగే ఉపాధి పనులను వారు పర్యవేక్షించి కూలీల సమస్యలను తెలుసుకున్నారు. 8 నెలలుగా పనిచేస్తున్నా వేతనాలు తమ బ్యాంక్ ఖాతాల్లో జమ కాలేదని కూలీలు వారి దృష్టికి తెచ్చారు. పూటగడవడమే కష్టంగా ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు.

నెరవేరని డబుల్ రోడ్డు కల

- పది నెలలైనా నెరవేరని ఎమ్మెల్యే హామీ
- మంజూరు కాని బీటీ రోడ్డు
- ఇరువైపులా ఏర్పడిన గుంతలతో ప్రమాదానికి గురవుతున్న వాహనదారులు

నందికొట్కూరు-పగిడ్యాల డబుల్ రోడ్డు కల నెరవేరడం లేదు. ప్రభుత్వం ఏర్పడి పది నెలలైనా రోడ్డు మంజూరు చేయించలేకపోవడంతో ఎన్నికల హామీ నెరవేర్చడంలో ఎమ్మెల్యే విఫలయ్యారనే ఆరోణలు వినిపిస్తున్నాయి. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే రోడ్డు సింగిల్ రోడ్డు కావడంతోపాటు ఇరువైపులా గుంతలు తేలి ఉండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల కురిసిన వర్షపునీరు గుంతల్లో చేరి మరింత ప్రమాదకరంగా మారింది.

పగిడ్యాల: అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే నందికొట్కూరు-పగిడ్యాల వరకు ఉండే సింగిల్ లైన్ బీటీరోడ్డును డబుల్‌లైన్ రోడ్డుగా మంజూరు చేయిస్తామని కూటమి నేతలు గొంతు చించుకున్నారు. నమ్మి ఓట్లేసి గెలిపించిన ప్రజలకు అధికారంలోకి వచ్చిన తర్వాత పంగనామాలు పెట్టారు. పది నెలలవుతున్నా పదేపదే బీటీ రోడ్డుకు నిధులు కేటాయిస్తామని ఎమ్మెల్యే గిత్త జయసూర్య చెబుతున్న మాటలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. 2024 నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏ గ్రామానికి వెళ్లిన ఆ గ్రామంలో అభివృద్ధికి పెద్దపీట వేసి గుంతలమయమైన రోడ్లను అభివృద్ధి చేస్తామని మోసపూరిత వాగ్దానాలిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలవుతున్నా ఎమ్మెల్యే ఇచ్చిన హామీకి మోక్షం లభించకపోవడం శోచనీయం. పగిడ్యాల మండలానికి ఎమ్మెల్యే హోదాలో మొదటిసారి పింఛన్ల పంపిణీకి హాజరై త్వరలోనే ఆర్‌అండ్‌బీ మంత్రితో మాట్లాడి రోడ్డుకు నిధులు మంజూరు చేస్తానని నమ్మించారు. అలాగే పల్లె పండుగ కార్యక్రమం, మరో రెండు పర్యాయాలు ప్రజా సమస్యల పరిష్కార వేదికల్లోనూ ఇదే చెప్పారు. ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశాల్లో కూడా అసెంబ్లీలో పగిడ్యాల డబుల్ రోడ్డుకు నిధులు మంజూరు చేయాలని ప్రస్తావించి పైసా కూడా మంజూరు చేయించలేకపోయారని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు.



ఇటీవల కురిసిన వర్షానికి పగిడ్యాల-నందికొట్కూరు బీటీ రోడ్డుకు ఇరువైపులా నిలిచిన వర్షపునీరు

మోకాళ్లలోతు గుంతలు

నందికొట్కూరు పట్టణానికి వివిధ అవసరాల నిమిత్తం వందలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా మోకాళ్ల లోతు ఏర్పడిన గుంతల కారణంగా వాహన చోదకులు సైతం ప్రమాదాల బారినపడి ప్రాణాలను కోల్పోతున్నారు. గాయాలపాలైన ఘటనలు అనేకం ఉన్నాయి. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే పగిడ్యాలకు డబుల్ రోడ్డు మంజూరు చేయించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయా గ్రామాల ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

హామీని నిలబెట్టుకోవాలి



ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే నందికొట్కూరు నుంచి పగిడ్యాల వరకు డబుల్‌లైన్ బీటీ రోడ్డు వేయిస్తామని జయసూర్య హామీ ఇచ్చారు. గెలిచి ప్రమాణస్వీకారం చేసి పది నెలలవుతున్నా అతీగతీ లేదు. నాయకులు కేవలం ఓట్లు దండుకోవడానికి మాత్రమే అబద్ధపు హామీలు ఇస్తారని మరోసారి తేటతెల్లమైంది. ఇప్పటికైనా రోడ్డు మంజూరు చేయించి మాట నిలబెట్టుకోవాలి. – ఖాశీం, పగిడ్యాల

ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి



నందికొట్కూరు నుంచి పగిడ్యాల వరకు రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా మోకాళ్ల లోతు గుంతలు ఏర్పడ్డాయి. సింగిల్ రోడ్డు కావడంతో ఎదురుగా వచ్చే వాహనాలకు సైడ్ ఇచ్చే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ ఏడాది ప్రారంభంలో ప్రాతకోటకు చెందిన యువకులు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందారు. చిన్నచిన్న ఘటనలు చాలాజరిగాయి. డబుల్ రోడ్డు మంజూరు చేయిస్తానంటేనే ఓట్లేసి గెలిపించాం. ఇప్పుడు పట్టించుకోవడం లేదు. – లోకేష్, పగిడ్యాల

ఆర్టీసీలో పదోన్నతులు కల్పించాలి

నందికొట్కూరు: ఆర్టీసీలో ఆగిపోయిన ప్రమోషన్లను ఇవ్వాలని నేషనల్ మజ్దూర్ యూనియన్ రీజినల్ కమిటీ సభ్యులు సుధాకర్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆర్టీసీ డిపో ఎదుట న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఎన్‌ఎంయూ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నైట్ అలవెన్స్‌లు పెంచి, పెండింగ్‌లో ఉన్న వాటిని చెల్లించాలన్నారు. గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరాలన్నారు. అక్రమ సస్పెన్షను, అక్రమ రిమూవల్స్‌ని తక్షణమే ఆపాలన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ విధానం ప్రకారం ఇవ్వాల్సిన సెలవులను మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూ గ్యారేజీ సెక్రటరీ పీఆర్ శేఖర్‌రెడ్డి, నాయకులు జనార్దన్ పాల్గొన్నారు.



నల్లబ్యాడ్జీలు ధరించి ఆర్టీసీ డిపో ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు

ముగిసిన వేలంపాటలు



వేలాలు నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: మహానంది దేవస్థానం ప్రాంగణంలోని ఖాళీస్థలాల్లో షాపులు నిర్వహించుకునేందుకు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గురువారం బహిరంగ వేలాలు నిర్వహించారు. పాదరక్షలు భద్రపరుచుకు హక్కులను మహానందికి చెందిన సురసుర వెంకటరమణ రూ.10,65,000కు దక్కించుకున్నారు. కాగా గత ఏడాది రూ.16,03,000 రాగా ఈ ఏడాది రూ.5.38 లక్షల నష్టం వాటిల్లింది. ఖాళీ స్థలాల్లో ఒక్కో షాపుకు నెలకు రూ.2,700 చొప్పున 24 షాపులకు నెలకు రూ. 64,800 ప్రకారం పాత వారికే కట్టబెట్టినట్లు అధికారులు తెలిపారు. వీటితోపాటు రెండు పొలాలకు వేలాలు జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ ఎరమల మధు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు నాగమల్లయ్య, పి.సుబ్బారెడ్డి, సెక్షన్ ఇన్‌చార్జ్ మల్లికార్జునయ్య పాల్గొన్నారు.

జెరూసలేం శాల వద్ద ఉద్రిక్తత

- హైవే నిర్మాణ పనులను అడ్డుకున్న చర్చి నిర్వాహకులు

పాములపాడు: మండలంలోని రుద్రవరం గ్రామ శివారులో ఉన్న జెరూసలేం శాల వద్ద గురువారం ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. నేషనల్ హైవే 340సి నిర్మాణ పనుల్లో భాగంగా చర్చి నిర్వాహకులతో నేషనల్ హైవే పీడీ పద్మ, తహసీల్దార్ సుభద్రమ్మ చర్చించారు. హైవే నిర్మాణానికి సహకరించాలని కోరారు. కోర్టులో కేసు నడుస్తుండగా రోడ్డు పనులు ఎలా చేస్తారని చర్చి నిర్వాహకులు అధికారులను ప్రశ్నించారు. ఈ విషయంపై ఇటీవల జిల్లా కలెక్టర్ రాజకుమారి పర్యటనలో భాగంగా చర్చి నిర్వాహకులతో అధికారులతో మాట్లాడారు. రహదారిని నిర్మాణ పనులను ఎవరు అడ్డుకో రాదని కోర్టు నుంచి ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు వచ్చిందని వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని ఆదేశించిన విషయాన్ని తెలియజేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని పనులు చేయించేందుకు యత్నించారు. ఈక్రమంలో నిర్వాహకులకు పోలీసులకు తోపులాట జరిగింది. అనంతరం అధికారులు అక్కడి నుంచి వెనుతిరిగారు.



హైవే పనులను అడ్డుకుంటున్న చర్చి నిర్వాహకులు

మహానందిలో వర్షం

మహానంది: మహానంది దేవస్థానం ప్రాంగణంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి భారీ గాలులతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. మరోసారి భారీ గాలులతో అరటి, వరి, ఇతర పంటల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తిమ్మాపురం, అబ్బీపురంతో పాటు పలు గ్రామాల్లో భారీ గాలికి ఇళ్ల పైకప్పులు ఎగిసిపడ్డాయని గ్రామస్తులు తెలిపారు. ఇదిలా ఉండగా భారీ గాలుల రాకతో గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

తర్తూరులో జాతర సందడి



రంగులరాట్నం సిద్ధం



జిగ్‌జాగ్ రాట్నం



ఊహాలోకం: ఊయలలు రెడీ..

జూపాడుబంగ్లా: తర్తూరులో జాతర సందడి మొదలైంది. పక్షం రోజుల పాటు జరిగే శ్రీలక్ష్మీరంగనాథుని బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించే జాతరకు రాష్ట్రవ్యాప్తంగా ఎంతో పేరుంది.

జాతరలో పేదవాడి నుంచి ధనికుడికి అవసరమైన వంటింటి సామగ్రితో పాటు పలురకాల వస్తువులు లభిస్తాయి. నాగలి, గుంటిక, తడిక, పొనక ఎద్దులకు మువ్వలు, గంటలు తదితర వ్యవసాయ పరికరాలతోపాటు ఎద్దుల క్రయ, విక్రయాలు భారీగా జరుగుతాయి. రుచికరమైన మాంసపు కడ్డీలకు పెట్టిందిపేరు. జాతరకు వచ్చిన భక్తులు తప్పనిసరిగా కడ్డీల రుచిచూడకుండా వెనుదిరగరు. భక్తులను ఆకట్టుకునేందుకు వ్యాపారులు తమ అంగళ్లను పలురకాల వస్తువులతో, ఆటపరికరాలతో, రంగరాట్నాలు, బ్రేక్‌డాన్స్ వంటి వినోద పరికరాలతో ముస్తాబుచేస్తున్నారు.

రేపు శివపురంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ

కొత్తపల్లి: ఈనెల 12న మండలంలోని శివపురం గ్రామంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తారక్, ప్రవీణ్, సురేష్, ప్రేమ్, విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ విజేతలకు రూ.30 వేలు, రూ.20 వేల నగదు బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 11 సాయంత్రంలోగా 7893030631, 9100684370, 8309936967, 8790372547 నంబర్లకు ఫోన్ చేసి ప్రవేశ రుసుం రూ.600 చెల్లించి జట్ల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

త్వరలోనే వసతి గృహాల నిర్మాణ పనులు

మహానంది: మహానంది ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా నూతనంగా నిర్మించనున్న 50 వసతి గృహాల నిర్మాణాలను త్వరలో మొదలుపెడతామని దేవదాయశాఖ డీఈ ఎం.శ్రీనివాసప్రసాద్ తెలిపారు. గురువారం మహానందికి వచ్చిన ఆయన ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డితో కలిసి ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా డీఈ శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ రూ.10.50 కోట్లతో నిర్మించనున్న వసతిగృహాల పనులకు వారం రోజుల్లో మార్కింగ్ వేసి పనులు ప్రారంభిస్తామన్నారు. ఆలయ ప్రాంగణంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు.

వీఆర్వోలకు శిక్షణా తరగతులు

ఆత్మకూరు: నియోజకవర్గంలోని పాములపాడు, ఆత్మకూరు, వెలుగోడు, కొత్తపల్లి మండలాల పరిధిలోని వీఆర్వోలకు గురువారం ఆర్డీఓ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లా సహాయ సంచాలకులు ఓబులేష్, ఆర్డీఓ నాగజ్యోతి హాజరై మాట్లాడారు. గ్రామాల్లోని చెరువులు, చెక్ డ్యాంలు, ఊటకుంటల తవ్వకపు బావులు, గొట్టపు బావులు, 2024 సంవత్సరానికి సంబంధించి సర్వే చేయాల్సి ఉంటుందన్నారు. ప్రధానమంత్రి సోలార్ పథకానికి సంబంధించి వీఆర్వోలు ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈ రామసుబ్రహ్మణ్యం తెలియజేశారు. పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఓబులేష్, సహాయ గణాంక అధికారులు పాల్, విమల పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతులు

నందికొట్కూరు: మండల పరిధిలోని శాతనకోట గ్రామంలో పొలాలకు రైతులు వెళ్లే దారిలో ఉన్న బోరుకు సర్పంచు జనార్దన్‌గౌడ్ మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని బోరును రిపేరు చేయించినట్లు తెలిపారు. రైతులతోపాటు పశువులకు కూడా బోరు దాహం తీర్చనుందన్నారు.

కౌలు గుర్తింపు కార్డులతో ప్రయోజనాలు

వెలుగోడు: కౌలు గుర్తింపు కార్డులతో కౌలు రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డుతో రాష్ట్ర ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాలు, ఎరువులు పొందొచ్చన్నారు. మద్దతు ధరతో పంటలు విక్రయించుకోవచ్చన్నారు. పరిహారం పొందొచ్చన్నారు.

హనుమద్వాహనంపై శ్రీరంగనాథుడు





భక్తులకు దర్శనమిస్తున్న శ్రీలక్ష్మీరంగనాథస్వామి, లక్ష్మీదేవి అమ్మవారు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజు గురువారం స్వామివారు హనుమద్వాహనంపై భక్తులకు అభయమిస్తూ దర్శనమిచ్చారు. ముందుగా స్వామివారి మూల విగ్రహానికి పంచామృతాభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన వంటి విశేషపూజలు నిర్వహించి స్వామివారికి మహామంగళహారతినిచ్చారు. అనంతరం స్వామివారి ఉత్సవవిగ్రహానికి పన్నీటిస్నానం చేయించి పట్టువస్త్రాలు, వెండితొడుగుతో ముస్తాబుచేశారు. మల్లెలతో అలంకరించిన పల్లకీలో స్వామివారి ఉత్సవవిగ్రహాన్ని కూర్చొండబెట్టుకొని బోయీలు గ్రామోత్సవ రథం వరకు స్వామివారి తీసుకొచ్చారు. హనుమంతునివిగ్రహంతో అలంకరించిన స్వామివారి గ్రామోత్సవ రథంపై శ్రీలక్ష్మీరంగనాథున్ని కూర్చొంబెట్టారు. అనంతరం భక్తులు జయ జయ ధ్వానాల మధ్య సామివారి గోవింద నామాన్ని స్మరిస్తూ గ్రామపురవీధుల్లో స్వామివారి రథాన్ని తిప్పారు. ఈసందర్భంగా భక్తులు స్వామివారికి కొబ్బరికాయలు, కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

నేడు గరుడవాహనసేవ

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి గరుడవాహన సేవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ సాయికుమార్, పూజారి ఈశ్వరరెడ్డి, కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి తెలిపారు.

మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు

నందికొట్కూరు: రబీ సీజన్‌లో వేసిన మొక్కజొన్న పంటను కత్తెర పురుగు ఆశించిందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు డాక్టర్ రామకృష్ణారావ్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ సుజాతమ్మ తెలిపారు. గురువారం నందికొట్కూరు గ్రామ పొలిమేరలో రైతు చిన్న జమాల్‌వలి అనే రైతు బోర్ల కింద వేసిన సమస్యాత్మక మొక్కజొన్న పంటను శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కజొన్న పంట కండెలు, గింజ ఏర్పడిన దశలో ఉన్నాయన్నారు. మొక్కజొన్న పంటలో కత్తెర పరుగు ఆశించిందన్నారు. రైతులు మొక్కజొన్న పంటను ఏకపంటగా కాకుండా ప్రతి మూడేళ్లకోసారి పంట మార్పిడి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ రమణమ్మ, వెంకటరమణ పాల్గొన్నారు.



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఆర్డీఓ పర్యటన

బండిఆత్మకూరు: మండలంలో ఆర్డీఓ నాగజ్యోతి గురువారం పర్యటించారు. ముందుగా ఈర్నపాడు సమీపంలో అకాల వర్షానికి నేల వాలిన వరి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం బండిఆత్మకూరు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థినులతో మాట్లాడారు. వంట గదిని పరిశీలించి, ఆహారాన్ని రుచి చూశారు. పరిశుభ్రత విషయంలో జాగ్రత్తగా ఉండాలని వంట సిబ్బందికి సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ పద్మావతి ఉన్నారు.

పార్టీని బలోపేతం చేద్దాం

ఆత్మకూరు: ప్రధాని నరేంద్రమోదీ సిద్ధాంతాలను ప్రజలకు తెలియజేసి గ్రామస్థాయిలో బీజేపీని బలోపేతం చేద్దామని ఆ పార్టీ శ్రీశైలం ఇన్‌చార్జ్ మోమిన్‌షబానా కార్యకర్తలకు సూచించారు. గురువారం ఆమె ఆత్మకూరులో పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు చల్లా దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి చింతా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకులకే టోకరా?

- ఫేక్ ఐడీ కార్డులతో రుణాలు

వెలుగోడు: బ్యాంక్‌లకే కొందరు టోకరా పెట్టినట్లు తెలుస్తోంది. ఫేక్ ఐడీ కార్డులు చూపి రుణాలు తీసుకుని చెక్కేసినట్లు సమాచారం. అప్పు చెల్లించాలని బ్యాంక్ అధికారులు ఫోన్ చేయగా తాము రుణమే తీసుకోలేదని సమాధానం రావడంతో అవాక్కయ్యారు. అయితే ఫేక్ ఐడీ కార్డు అడ్రస్ ఉన్న వ్యక్తులు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు.

ఎస్‌ఐ లేకపోవడంతో అక్కడి సిబ్బంది ఆత్మకూరు సీఐని కలిసి ఫిర్యాదు చేయాలని ఉచిత సలహా ఇచ్చి పంపినట్లు బాధితులు వాపోయారు. కాగా వెలుగోడుకు చెందిన ఓ వ్యక్తి తన స్నేహితులు, బంధువుల ఆధార్ కార్డులతో సిమ్‌లు, పాన్ కార్డులు, ఏటీఎం కార్డులు తయారు చేసుకొని హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సెస్, ఐసీఐసీఐ బ్యాంక్‌ల్లో ఒక్కో వ్యక్తి పేరుతో రూ.2 లక్షల వరకు రుణాలు తీసుకున్నట్లు తెలిసింది. పూర్తి వివరాలు విచారణలో తేలాల్సి ఉంది.

మెనూ తప్పక పాటించాలి

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రభుత్వ హాస్టళ్లు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం ఆహార పదార్థాలు వడ్డించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ పి.విజయ్ ప్రతాపరెడ్డి ఆదేశించారు. గురువారం సాయంత్రం ఆయన సున్నిపెంటలోని మహాత్మా జ్యోతిభాపూలే బి.సి.గురుకుల, గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాలలను తనిఖీ చేశారు. వంటశాలలను పరిశీలించి ఆహార పదార్థాలను రుచి చూశారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందడం లేదని గిరిజన గురుకుల పాఠశాల వార్డన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.



భోజనం రుచి చూస్తున్న విజయ్‌ప్రతాపరెడ్డి